





నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

# 'దుర్గం'లో మాటల యుద్ధం..!





- ◆ ఎమ్మెల్యే వర్సస్ మాజీ ఎంపీ
- ◆ ఆరోపణలు...ప్రత్యారోపణలు
- ◆ హీటెక్కిన దుర్గం రాజకీయం

**ఇటీవల కళ్యాణదుర్గం నియోజకవర్గం రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నేతలు వ్యక్తిగత ఆరోపణలకు సైతం దిగుతుండడం రాజకీయా వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. నియోజకవర్గ కేంద్రంగా చోటు చేసుకుంటున్న రాజకీయ, అవినీతి సంఘటనలతో అధికార పార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ రంగయ్యల మధ్య మాటకుమాట పెరుగుతోంది.**

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

వైసిపి సమన్వయకర్త రంగయ్య సేవ్ ఆర్డీటీ పేరుతో నియోజవకర్గంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సమయంలో ఆయన ఎమ్మెల్యే అమిలినేనిపై పలు వ్యాఖ్యలు చేశారు. తన పాదయాత్రను పోలీసుల ద్వారా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆటంకాలు సృష్టిస్తున్నారంటూ రంగయ్య విమర్శలు గుప్పించారు. ఆర్డీటీ పేరుతో రంగయ్య రాజకీయ ఉనికి కోసం పాకులాడుతున్నారని టిడిపి ఎమ్మెల్యే ప్రతివిమర్శలు చేస్తూ వచ్చారు. ఇటీవల వైసిపి విస్తృతస్థాయి సమావేశాల్లోనూ రంగయ్య ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. వ్యక్తిగతంగా తనపైనా, తన కంపెనీపైనా విమర్శలు చేస్తే 'మీ ఇంటికి వచ్చి నిలదీసే దమ్ము, ధైర్యం నాకుంది' అంటూ ఎమ్మెల్యే జవాబు ఇచ్చారు. ఇలా ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.

**రాజకీయవేడి**
**రగల్చిన ఈ-స్టాంపుల కుంభకోణం**

కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగుచూసిన ఈ-స్టాంపుల కుంభకోణం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మరింత అలజడి రేపింది. 20 రోజుల కిందట ఈ-స్టాంపుల కుంభకోణం వెలుగుచూడడంతో రాజకీయ విమర్శలకు టీడీపీ, వైసీపీ మరింత పదును పెట్టాయి. ఈ-స్టాంపుల కుంభకోణం ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో సుమారు వారం రోజుల పాటు సంచలనం రేకెత్తించింది. నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణంలో ఎమ్మెల్యే సురేంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా వ్యవహరిస్తున్న ఎర్రప్ప అలియాస్ మీసేవా బాబు పాత్ర వెలుగు చూడడంతో ప్రతిపక్ష వైసీపీ, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యే విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. స్వయాన ఎస్ఆర్సి ప్రతినిధులు ఈ-స్టాంపుల వ్యవహారంలో మీసేవా బాబు మాతో నమ్మకంగా ఉంటూ మోసగించాడని పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి పరిస్థితి ఎదురైంది. ఇక్కడ మొదలైన ఈ వ్యవహారం టీడీపీ, వైసీపీల మధ్య విమర్శల దుమారానికి దారితీసింది. స్వయాన వైసీపీ సమన్వయకర్త రంగయ్య ఇదంతా ఎమ్మెల్యే సురేంద్రబాబుకు తెలియకుండా జరగలేదని విమర్శలు పరంపర కొనసాగించారు. ఈ కుంభకోణంలో తనకు గానీ, తన కంపెనీకి ఎలాంటి సంబంధం లేదంటూ ఎమ్మెల్యే అమిలినేని తిప్పికొట్టారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను సిద్ధమని కూడా ప్రకటించారు.

**ఆరోపణలు.. ప్రత్యారోపణలు**

ఇటీవల వైసీపీ విస్తృతస్థాయి సమావేశాల్లో ఈ-స్టాంపుల వ్యవహారంతోపాటు యాటకల్లు, ఐదుకల్లు గ్రామాల మధ్య కొండను నాశనం చేయడానికి ఎమ్మెల్యే పూనుకున్నారని రంగయ్య చేసిన వ్యంగ్రస్త్రాలు టీడీపీ నాయకులకు ఆగ్రహం తెప్పించాయి. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో కొనసాగుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పందిస్తూ వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అవసరమైతే రంగయ్య కావచ్చు... ఇతర పార్టీల్లో టికెట్లు ఆశించి రాలేదని తప్పుడు సలహాలిస్తున్న మరొకవరు కావచ్చు...వారి ఇంటికే వెళ్లి నిలదీస్తానంటూ ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. ఇలాంటి విమర్శ, ప్రతి విమర్శలతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కళ్యాణదుర్గంలో మాటల యుద్ధం చోటు నడుస్తూనే ఉంది. ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

## సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

- ◆ అర్ధరాత్రి నుంచి విధుల బహిష్కరణ
- ◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళనబాట పట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి విధులను బహిష్కరించి పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతపురంలో నగరపాలక సంస్థ నుంచి టవర్ క్లాక్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. అంతకు మునుపు నగరపాలక సంస్థ ఎదుట చేపట్టిన నిరసనలో సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, ఇంజినీరింగ్ వర్కర్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్, మాట్లాడారు. కార్మికులు అనేక రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం వల్ల వేరే దారిలేక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలియజేశారు. సమ్మెలోకి వెళ్తున్నామని చెప్పిన తర్వాత సంబంధిత మంత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు ఇస్తున్నారని చెప్పారు. ప్రకటనలు ఇస్తున్నారు తప్పా ఎంత వేతనం ఇస్తారు.. ఏ జీవో ప్రకారం ఇస్తారు.. ఎప్పటినుంచి ఇస్తారన్న విషయంపై స్పష్టత లేదన్నారు. సమ్మెను తప్పుదోవ పట్టించేందుకే ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కార్మికులు, కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తోందని, దీనిని ఎవరూ నమ్మొద్దన్నారు. జీవో 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 వేతనం ఇచ్చే వరకు కార్మికుల ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులు చేపట్టే ఆందోళనలు అన్నింటికీ సిఐటియు మద్దతుగా ఉంటూ ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, నాయకులు ఎర్రిస్వామి, లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్‌ల బెదిరింపులు వస్తే ఫిర్యాదు చేయండి

**పుట్లూరు :** బెట్టింగ్ యాప్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో చాలామంది యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మాయలో పడుతున్నారన్నారు. అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌ల్లో చిక్కుకున్న యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అలాచేయకుండా బెదిరింపులు వచ్చిన వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే యువతకు ఉద్యోగావకాశాలు కోసం మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.



105వ కిలోమీటర్ వద్ద ప్రధాన కాలువ వద్ద రెగ్యులేటర్ దింపివేసిన దశ్యం

## హెచ్ఎల్‌సికి ఆగిన నీటి సరఫరా

### రెగ్యులేటర్ దింపిన అధికారులు

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

జిల్లాలోని బొమ్మనహాల్ సమీపం ఆంధ్ర సరిహద్దులో హెచ్ఎల్సీ కాలువకు నీటి సరఫరా ఆగింది. 105 కిలోమీటర్ల వద్ద రెగ్యులేటర్లను అధికారులు కిందకు దించేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈ నెల 10వ తేదీన హెచ్ఎల్‌సి కాలువకు నీటిని విడుదల చేశారు. ఆ నీరు శనివారం సాయంత్రం ఆంధ్ర సరిహద్దు బొమ్మనహాల్ ప్రాంతానికి రావాల్సి ఉంది. అయితే 105 కిలోమీటర్ల నుంచి ఆంధ్రాలో కాలువల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ పనుల నేపథ్యంలో కర్ణాటక సరిహద్దులోనే అక్కడి అధికారులు నీటిని ఆపేశారు. నీరురాకపోవడంతో జిల్లా రైతులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. హెచ్ఎల్సీ కాలువల మరమ్మతులకు సంబంధించి గుత్తేదారులు వారు తీసుకున్న పనులను నత్తనడకన చేస్తున్నారు. నీరు వచ్చే సమయానికి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ప్రస్తుతం నీరు అందకుండా పోయాయి. ఈ నీరు వచ్చి ఉంటే పంటలు, తాగునీటికి ఉపయోగంగా ఉండేది. అనంతపురం జిల్లాకు తాగునీటి కోసం నెల రోజుల పాటు ఈ కాలువ ద్వారా నీటిని వదలాల్సి ఉంది. అనుకున్న సమయంలో నీరు రాకపోడంతో నెల రోజుల పాటు నీటి సరఫరా ఉంటుందా.. లేదా.. అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం చేస్తున్న పనులు పూర్తవడానికి ఇంకా 20 రోజులు సమయం పడుతుందని హెచ్ఎల్సీ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత నీటి విడుదల ఎలా ఉంటుందన్న అంశం అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుంది. పనులు నెమ్మదిగా జరుగుతున్నా వాటిని వేగవంతం చేయించడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపడంపై రైతుల నుంచి అసహనం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వేగవంతం చేయించి అనుకున్న సమయానికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఎండిపోతున్న వేరుశనగ పంట

- ◆ పరిశీలించిన రైతు, ప్రజాసంఘాల నాయకులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**



ఎండిన పంటలను పరిశీలిస్తున్న రైతు, ప్రజాసంఘాల నాయకులు

కూడేరు మండల పరిధిలోని కడదరకుంట గ్రామంలో రైతులు బోరుబావుల కింద వేరుశనగ సాగు చేశారు. బోర్లు నీరు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు శనివారం ఎండిన పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్.రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బోర్లలో నీళ్ళ బాగా ఉన్నాయని, ముందస్తు వర్షాలు వస్తున్నాయన్న ఆశతో రైతులు వేరుశనగ పంట సాగు చేశారన్నారు. వర్షాభావం, బోరుబావుల్లో నీరు ఎండిపోవడంతో పంటల మొత్తం ఎండిపోతున్నాయన్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. పీఏబీఆర్ డ్యాం ద్వారా కూడేరు మండలంలోని ముద్దులాపురం ,ఇప్పేరు చెరువులకు నీళ్ల ఇస్తే బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరప్ప, వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కరీంసాబు, మేకల పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల సమావేశం

**అనంతపురం :** నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి మాట్లాడుతూ పిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ఎబిసిడబ్ల్యుఒ సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థినులను లక్ష్యాలు సాధించుకునే విధంగా సహకరించాలని సూచంచారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ విద్యార్థినులకు ఆట వస్తువులు సొంత నిధులతో అందజేశారు. తర్వాత తల్లితండ్రులు అందరికీ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత పదవ తరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థినులను సన్మానించారు. సమావేశం అనంతరం తల్లిదండ్రులు అందరితో కలిసి భోజనం చేశారు.

## అనంతలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

**అక్టోబర్ 13,14,15న**

### జయప్రదం చేయాలని సన్నాహక సమావేశంలో నేతలు పిలుపు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**




సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు అనంతపురం కేంద్రంగా జరగనున్నాయి. అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో మహాసభలను నిర్వహించేందుకు ఆ సంఘం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు అనంతపురం ఎన్జీవో హోంలో ఐద్వా రాష్ట్ర మహాసభల నిర్వహణ ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, స్నేహలత నర్సింగ్ హోమ్ డాక్టర్ అరుణ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, ఆహ్వాన సంఘం ఫ్యాట్రన్స్ గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వికె.పద్మావతమ్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌వి సూపర్‌మార్కెట్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, రవికాంత్ రమణ, ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మైత్రి ఆసుపత్రి డాక్టర్ బాలా కుమారి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ మాధవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, అధ్యాపకురాలు డాక్టర్ పల్లవి, శోభామణి, ఆహ్వాన సంఘం కోశాధికారి శ్యామల, మానవత తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, సామాజిక వేత్త బోస్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు దేవేంద్రమ్మ, సరళ, ప్రమీళ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. ఎంత జాగ్రత్త వహించినా ఊహించని విధంగా దారుణాలకు గురవుతున్నారని తెలిపారు. సమానత్వం ఇంకా రాని నేపథ్యంలో పాలకులు సనాతన ధర్మాన్ని అనుసరిద్దామంటూ చెబుతుండటం ప్రమాదకరం అన్నారు. దురాచారాల నుంచి బయట పడాలంటే స్త్రీలపై మగవారి ధోరణిలో మార్పు రావాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకోవడంతో పాటు నేడు ముందుకొచ్చిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు. మహాసభల గొంతుకగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్ సమస్యలు, మద్యం సమస్యలు, కులాంతర వివాహితుల సమస్యలు, పసి బిడ్డలపై జరుగుతున్న దాడులు, ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలులో జాప్యం తదితర వాటిపై చర్చిస్తామన్నారు. మహాసభలకు అనంతపురం జిల్లాలోని మేధావులు, రచయితలు, కవులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళా, ప్రజా సంఘాలు భాగస్వాములుగా ఆయా రంగాల నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. మహాసభల విజయవంతానికి అందరూ సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఆహ్వాన సంఘం ఫ్యాట్రన్స్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీల పరిస్థితులు గతం కంటే నేడు మెరుగ్గా ఉన్నప్పటికీ పూర్తిగా ఇంకా మహిళా స్వేచ్ఛ సమానత్వం రాలేదన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నా వారికి అక్కడ బాధలు తప్పడం లేదన్నారు. మహిళా సమస్యలన్నింటిపై ఐద్వా మహాసభల్లో చర్చించాలన్నారు. రవికాంత్ రమణ మాట్లాడుతూ మహాసభల విజయవంతం కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఐద్వా ఆహ్వాన సంఘం కార్యదర్శి వి.సావిత్రి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా చేపట్టిన ఉద్యమాల్లో మేధావులు, రచయితలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పాత్ర ఎంతో కీలకంగా నిలిచాయని తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా కళాశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్‌లు, అవగాహన సదస్సులు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రిక, సీనియర్ నాయకురాలు రామాంజినమ్మ, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషాద్, అశ్విని, జెవివి నాయకులు తిరుపాల్, ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖం రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, శ్రామిక మహిళా లక్ష్మినరసమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు

## అనంతపురం ఐఎంఎ కృషి అభినందనీయం

### ఎపి వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం ఐఎంఎ కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు అన్నారు. శనివారం అనంతపురంలోని ఐఎంఎ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం ఐఎంఏ కృషి అభినందనీయమన్నారు. వైద్యులు ఐక్యమత్యంగా ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్యులు ప్రమాణాలు పాటించడం ముందున్నారు అన్నారు. వైద్యులు రిజిస్ట్రేషన్ గతంలో కష్టతరంగా ఉండేది, ఐతే ఇండియాలో మొట్టమొదటి సారిగా రిజిస్ట్రేషన్ ప్రాంతాల వారీగా ఏర్పాటు చేశామన్నారు. ఈ అంశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎపి వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు విశేషమైన కృషిని అనంత వైద్యులు కొనియాడి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు, కార్యదర్శి డాక్టర్ ముళీకృష్ణ, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డా.కొండయ్య, వీరభద్రయ్య, మనోరంజన్‌రెడ్డి, థామస్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, శివాజీరాజ, వంశీకృష్ణ, గోపీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భీమలింగేశ్వరస్వామి రథోత్సం

**ప్రజాశక్తి-ఉరవకొండ**

విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్లు బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన భీమలింగేశ్వర స్వామి మహారథోత్సం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. ఇందులో భాగంగా వేదమంత్రోచ్చరణలు, వివిధ కళానృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. మహారథోత్సవాన్ని వీక్షించడానికి అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు వేలాదిసంఖ్యలో రావడంతో జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా విడపనకల్ మండల ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ఉచ్చాయం లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

## ఉద్యోగాల కల్పనకు కట్టుబడిన ఎన్‌డిఎ ప్రభుత్వం

### కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్

**ప్రజాశక్తి-గుంతకల్లు**



ఉద్యోగాలు సాధించిన యువతతో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్

దేశంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎన్‌డిఎ సర్కార్ కట్టుబడి ఉందని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజ్ శ్రీనివాసవర్మ అన్నారు. స్థానిక రైల్వే ఆఫీసర్లు క్లబ్ లో రైల్వే డివిజన్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్త అధ్యక్షతన శనివారం నిర్వహించిన 16వ రోజ్‌గార్ మేళాకు కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ సారథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా 16వ రోజ్‌గార్ మేలా ద్వారా 51 వేల మంది నిరుద్యోగులకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామకపత్రాలు అందజేశామన్నారు. ముఖ్యంగా గుంతకల్లులో రైల్వే, పోస్టల్, బ్యాంకింగ్ రంగాలలో 81 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం సుధాకర్, పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్, రాష్ట్ర నాయకులు సంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



# 'సీమ'లో పురోగతి లేని సాగునీటి ప్రాజెక్టులు

## సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ఎన్నో ఏళ్ల నుంచి రాయలసీమలో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడమే తప్ప పూర్తి చేసిన పాపాన పోలేదని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారయ్యాయన్నారు. 1995లో నాడు సిఎం చంద్రబాబు చేసిన శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులను 30 ఏళ్లు అయినా పూర్తి కాలేదన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడం మినహా పంట పిల్ల కాలువలు ఎక్కడ తవ్వ లేదన్నారు. వైసిపి పాలనలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి, జనసేన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై విజయవాడలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేస్తున్నామని, ఈ వేదికలో విద్యుత్ సమస్యలపై పోరాట చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. కాగా 26 జిల్లాల్లో మహాసభలు పూర్తయిన తర్వాత ఆగస్టు 23, 24, 25వ తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు బి.గోవిందు, నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాముదాయల్, పట్టణ, మండల సహాయ కార్యదర్శులు ఎస్ఎండి గౌస్, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

# కసాపురం ఆలయ ఉద్యోగి తొలగింపు

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో విధులు నిర్వహించే బి.రామాంజనేయులు అవినీతికి పాల్పడినందుకు తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు ఇఒ వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాంజనేయులు ఆలయ అన్నదాన సత్రంలో కొందరు భక్తులు సమర్పించిన విరాళాలకు రసీదులు ఇవ్వకుండా నగదు స్వాహా చేసినట్లు తెలిపారు. గమనించిన భక్తులు ఫిర్యాదు చేయడంతో విచారించి విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.


ఫ్యాన్లు, బల్బులను అందజేస్తున్న దాత

**ఆలయానికి ఫ్యాన్లు, బల్బుల వితరణ**

నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయానికి ఓ దాత ఫ్యాన్లు, ఎల్ఇడి బల్బులను వితరణ చేశారు. ఈమేరకు ఆయా వస్తువులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేష్, ఎఇఒ ఓంకారం, వెంకటేశ్వర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలే లక్ష్యంగా చదవాలి

**ప్రజాశక్తి-గుత్తి**

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి బాగా చదవాలని ఢిల్లీ రైల్వే బోర్డు అదనపు సభ్యులు విజయ ప్రతాప్‌సింగ్ సూచించారు. వ్యాపెక్ట్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శనివారం పట్టణంలోని జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో 50 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ల్యాబ్‌ను వినియోగించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, గుత్తి సీనియర్ డిఎంఇ ప్రమోద్, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకటశివుడు యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకన్న, వ్యాపెక్ట్ ప్రతినిధి రజనీష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ను తనిఖీ చేశారు.


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఢిల్లీ రైల్వే బోర్డు అదనపు సభ్యులు విజయ ప్రతాప్‌సింగ్

# ఉత్తమ ఎఎన్ఎం వనజ్యోతికి అభినందన


ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఎఎన్ఎం వనజ్యోతి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు వనజ్యోతికి ఉత్తమ ఎఎన్ఎంగా అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని వైద్యాధికారులు తేజస్వి సర్దార్‌వలి కొనియాడారు. శనివారం వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో మాతా, శిశు సంరక్షణ కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు అందించడంలో మెరుగైన సేవలు అందించినందుకు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎఎన్ఎంగా ఎంపిక చేశారన్నారు. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఉత్తమ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతోపాటు సిహెచ్ఒ లక్ష్మీదేవి, ఎంపిహెచ్ఇఒ గురుప్రసాద్, సూపర్‌వైజర్ సుశీలమ్మ, నాగశంకర్, పలువురు ఏఎన్ఎంలు అభినందించారు.

# వైద్యుల వద్దకే మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సేవలు

**ప్రజాశక్తి-అనంతపురం**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ జిల్లాలోని వైద్యుల వద్దకే వచ్చింది. శనివారం నగరంలోని వైద్య కళాశాలలో ఉన్న ఎన్ఎంసి సమావేశ మందిరంలో ఎపి మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా తెలిపారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డాక్టర్ కోర్స్ పూర్తి చేసిన వారు పెండింగ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మరామ్, డాక్టర్ శ్రీహరిరావు,వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ తెలుగు మధుసూదన్, డాక్టర్ శంకర్, డాక్టర్ శంషాద్ బేగం, సీనియర్ డాక్టర్లు హేమలత, మురళీకృష్ణ, గుండెల స్వర్ణలత, నిరంజన్‌రెడ్డి, మనోరంజన్‌రెడ్డి, గాలేటి చంద్రశేఖర్, వినీల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు



# 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**అనంతపురం కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శిల జయరామప్ప తెలిపారు. ఈమేరకు ధర్నాకు అనుమతి కోసం శనివారం పోలీసులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతోపాటు వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలి, కేంద్రంలో 8వ పే కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు, డిఆర్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, పెన్షనర్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను అమలు చేయాలని, రైల్వే, విమాన టికెట్లలో సీనియర్ సిటిజన్ రాయితీలను తిరిగి అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15ఏళ్ల కాలం నుంచి తగ్గించి 11ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# స్మార్ట్‌మీటర్లను ఉపసంహరించుకోవాలి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అదానీకి లాభాలు తెచ్చి పెడుతూ ప్రజలపై భారాలను మోపే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉంచుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా సిపిఎం ప్రచురించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల బిగింపుపై కూటమి ప్రభుత్వం రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. ఓవైపు ప్రజల సంక్షేమం అంటూనే మరోవైపు ప్రజలపై విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రక్రియలో భాగంగానే విద్యుత్ మీటర్ల బిగింపు ప్రక్రియకు శ్రీకారం చుడుతోందన్నారు. ఇది ప్రజలపై తీవ్ర భారాలను మోపే విధానమని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇదే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగులగొట్టమని పిలుపునిచ్చిన నాయకులు అధికారంలోకి వస్తానే అదే విధానాన్ని అమలు చేయడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగింపుతోపాటు పెంచిన కరెంట్ ఛార్జీలను రద్దు చేయకుంటే టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, ఓబులేష్, బాబు, సూరి, మారన్న, మల్లికార్జున, ఆంజనేయులు, నాగ, అశోక్ పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు మాకొద్దని సిఐటియు నాయకులు ఓబులేసు అన్నారు. శనివారం మండల కేంద్రంలో 'స్మార్ట్ మీటర్లు మాకొద్దు' అనే పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రానున్న రోజుల్లో రైతులు, ప్రజలకు ఉరితాడులా మారుతుందన్నారు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో సతమతమవుతున్న ప్రజలపై స్మార్ట్‌మీటర్లు బిగించి మరింత భారం మోపడం తదగన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసులు, వన్నూరుస్వామి, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నాయకులు


రాయదుర్గంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

**ఉరవకొండ :** కరెంటు స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేషులు డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండలోని కవిత సర్కిల్, అంబేద్కర్ సర్కిల్‌తోపాటు గుంతకల్లుకు వెళ్లే ప్రధాన రహదారి గుండా చిరు వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక పాత విధానాన్ని అవలంబించడం బాధాకరమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లతోపాటు ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, రామాంజనేయులు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 13, 14న 'అనంత'లో మధ్యాహ్న భోజనం యూనియన్

# రాష్ట్ర మహాసభలు

### విజయవంతం చేయాలని పిలుపు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

సెప్టెంబర్ 13,14వ తేదీల్లో అనంతపురంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. శనివారం స్థానిక గణేనాయక్ భవనంలో మహాసభల సన్నాహక సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం పేరు మార్పు చేశారని, మెనూ మార్చారని, కార్మికుల బతుకులు మాత్రం మారలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచడం లేదన్నారు. నెలల కొద్ది బిల్లులు, వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి మెనూ ఛార్జీలు కనీసం రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వంట గ్యాసు సరఫరా చేయాలన్నారు. వంట చేసేటప్పుడు అనేక ప్రమాదాలకు కార్మికులు గురవుతున్నారని, పాఠశాలల్లో ప్రథమ చికిత్స మెడికల్ కిట్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మిడ్ డే మీల్స్ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ సరఫరా చేయాలన్నారు. 10 నెలలకి వేతనం ఇస్తున్నారని, 12 నెలలకు వేతనం ఇవ్వాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపైనా రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మహాసభల విజయవంతానికి జిల్లాలో ఉన్న కార్మికులు ఉపాధ్యాయులు, ప్రజలు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య, యూనియన్ నాయకులు పద్మావతి, ఒసురమ్మ, శివలింగమ్మ, మంజుల, రాజేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి

# యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : ఎంపి అంబికా

### మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎంపి, ఒబిసి, కేంద్ర సిల్క్ బోర్డు, లేబర్, టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి కమిటీ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్.కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనే ముఖ్య లక్ష్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిరుద్యోగులను ఆదుకునే విధంగా అనేక పథకాలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని భావించి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో యువతను అనేక విధాలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువకులు ఆత్మవిశ్వాసంతో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పొంది ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, మంచి లక్ష్యాలతో తల్లి దండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ఎదిగి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఎంపీ తనయుడు జివి వీక్షిత్ మాట్లాడుతూ వివిధ కంపెనీల సహకారంతో నేటి మెగా జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ జాబ్ మేళా కు సంబంధించి ఆన్లైన్ ద్వారా సుమారు 1600 మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం 2000 దాకా వచ్చిన అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, ప్రముఖ న్యాయవాది పరిటాల శైలజ, వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, నిరుద్యోగ యువకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మీరు దోపిడీ చేస్తే..మేం చక్కబెడుతున్నాం..

### విప్ కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ఐదేళ్ల అరాచక పాలనతో వేలాది కుటుంబాలను వీధిపాలు చేసి వేలకోట్లు దోచుకున్న వైసిపి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లోకి రావాలని విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 5వవార్డులో పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో ఆగిన అభివృద్ధిని పట్టాలెక్కించామన్నారు. మరోవూపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మంచిపాలనను అందిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసిపి దోపిడీ రాజ్యం పీడ వీడిందని ప్రజలు ఎంతో సంతోషంతో ఉన్నారన్నారు. ఇలాంటి మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి వైసిపి 'చంద్రబాబు మేనిఫెస్టో'పై అసత్య ప్రచారం చేసేందుకు పూనుకుందన్నారు. గత ఐదేళ్లలో ప్రజలపై ఏమాత్రం బాధ్యత లేకుండా, అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తూ ఓ నియంత పాలనను మరిపించిన చరిత్ర మీది అని మండిపడ్డారు. జగన్ పాలనలో అరాచకం తప్ప చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు. ఐదేళ్ల అరాచక పాలనలో ఎన్నో సామాన్య కుటుంబాల భవిష్యత్తు నాశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మహబూబ్‌బాషా, హనుమంతు, పురుషోత్తం, కృష్ణమూర్తి, శంకర్, శివ, ఇనాయత్, కిరణ్, హరి, తదితరులు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

**కళ్యాణదుర్గం రూరల్ :** మండలంలోని ముద్దినాయనపల్లి, కాపర్లపల్లి ఎస్సీ కాలనీ, కాపర్లపల్లి, పిటిఆర్ పల్లి గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతోపాటు చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా గ్రామంలోని ముస్లిములు శ్మశానవాటికను కొందరు ఆక్రమించుకున్నారని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగించి శ్మశాన వాటికకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.. తర్వాత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగభూషణ, చాకలి సరస్వతమ్మ ఇళ్లకు వెళ్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఇకపోతే ఈనెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఖాతాల్లోకి నగదు జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సంబంధిత ప్రభుత్వాలు పాల్గొన్నారు.


చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

### చిన్నపాటి వర్షం పడినా

# నిండుకుంటున్న కల్వర్ట్

### రాకపోకలు బంద్-వాహనదారుల ఇబ్బందులు

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

చిన్నపాటి వర్షం పడినా బొమ్మనహాల్-బళ్లారి ఆర్ఎంపి రోడ్డులో ఉన్న కల్వర్టు నిండుకుంటోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొమ్మనహాల్-బళ్లారి ఆర్ఎంపి రోడ్డులో హెచ్చెల్సీ కాలువపై అధికారులు కల్వర్టును నిర్మించారు. కల్వర్టుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు మూసుకుపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిల్వ ఉంటోంది. దీంతో చిన్నపాటి కుంటను తలపిస్తూ ఉంటుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుపై నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


కల్వర్టుపై నిలబడి నీరు

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**గుత్తి :** కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కె. అబూబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎ, డిఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన వెలిడేషన్ అమెండమెంట్ ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంగం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికితీసేందుకే 'హ్యాకథాన్ 5.0'

**గుత్తి :** ప్రతిభను వెలికితీసే వేదికగా కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఇ ఇండియా హ్యాకథాన్ 5.0 నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్ మియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈ వెబ్ సైట్ ను సందర్శించి గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా తమ ఐడియాలను ఈనెల 14వ తేదీలోపు సమర్పించాలన్నారు. ఎంపికైన ఐడియాలను గరిష్టంగా రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించు కోవాలన్నారు.

# 'రీ కాలింగ్ చంద్రబాబు'కు తరలిరండి

**యల్లనూరు :** మాజీ సిఎం జగన్ ఆదేశాల మేరకు ఈనెల 14వతేదీ నుంచి యల్లనూరు మండలంలో నిర్వహించనున్న రీ కాలింగ్ చంద్రబాబు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు.. ఎన్ని అమలు చేయలేదు అని ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

# వైభవంగా పెన్నోబులేశుడి పల్లకిసేవ

**ఉరవకొండ :** మండలంలోని పెన్నోబలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి పల్లకిసేవను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు తక్కల్లపల్లిలో 'తొలిఅడుగు'

**పుట్లూరు :** మండల పరిధిలోని తక్కల్లపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొల అడుగు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

# ఆర్టీసీ స్లీపర్ బస్సు ఛార్జీల తగ్గింపు

**అనంతపురం :** ఆర్టీసీ ఇంద్ర, వెన్నెల స్లీపర్ బస్సుల ప్రయాణ ఛార్జీలను తగ్గించినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్ర బస్సులకు 15 శాతం, వెన్నెల సర్వీసులకు 20శాతం తగ్గించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేరాలు ఘోరాలు

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


మృతిచెందిన మునీర్

**గుత్తి :** మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన ఎండీ మునీర్ (48) ట్రాన్స్ ఇండియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తుండగా గుత్తి శివారులో బస్సు టైర్ పంచరైంది. దీంతో కరిడికొండ గ్రామ శివారులో బస్సు టైరు మార్చుతుండగా బెంగళూరు వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్ మృతికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

**యాడికి :** మండలంలోని చందన గ్రామ శివాలయం సమీపంలో శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ విజయ భాస్కర్‌రెడ్డి మృతిచెందాడు. భాస్కర్‌రెడ్డి కర్నూలు జిల్లా ప్యాపిలి నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం పులివెందుల తాలుకా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లికి బయలుదేరాడు. చందన శివాలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి పక్కనున్న గోతిలో పడ్డాడు. సమీపంలోని రైతులు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఈరన్న తెలిపారు.

# రైతు ఆత్మహత్యాయత్నం

**గుత్తి :** కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండా గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు సోమ్లానాయక్ శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సోమ్లా నాయక్ పంటల సాగు, కుటుంబ పోషణకు తెలిసిన వారితో పాటుగా బ్యాంకులలో అప్పులు చేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక దిగుబడులు రాలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలని కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సోమ్లానాయక్ ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న సోమ్లానాయక్‌ను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.